క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: చార్మినార్ సీబీడీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. జనప్రియ ఏబీసీ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేశవనగర్, కృష్ణానగర్, శివానగర్, మోర్ సూపర్ మార్కెట గుమ్మకొండ కాలనీ, జనప్రియ ఓహెచ్ ఫీడర్‌లో. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు న్యూఫ్రెండ్స్ కాలనీ, జనప్రియ అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, ప్రజెంట్ పార్క్, ఏజీ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంజీవనీహిల్స్, నలందానగర్, సిరిమల్లెనగర్, ఏజీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పట్టణ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా జగన్

శంషాబాద్: కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సిద్ధాంతి బస్తీకి చెందిన రాచమల్ల జగన్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు బి. రాజ్‌కుమార్ ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన పదవీ బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తానని ఈ సందర్భంగా జగన్ అన్నారు.

శంషాబాద్ ఏసీపీగా రాంచందర్‌రావు

శంషాబాద్: శంషాబాద్ ఏసీపీగా పి. రాంచందర్‌రావు నియమితులయ్యారు. గత మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న వి. భాస్కర్‌ను హైదరాబాద్ కమిషనరేట్ ముఖ్య కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు. వేయింటింగ్‌లో ఉన్న రాంచందర్‌రావును శంషాబాద్ ఏసీపీగా నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్

శంషాబాద్: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఇచ్చిన బంద్ పిలుపు మేరకు గురువారం పలు విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారంపై రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.


ఉమ్రా యాత్రికులకు ఘన స్వాగతం



ఉమ్రా యాత్రికులకు స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

శంషాబాద్: ఉమ్రా యాత్రికులకు శంషాబాద్ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. 15 రోజుల యాత్రను పూర్తి చేసుకున్న సుమారు 70 మంది యాత్రికులు గురువారం ఉదయం శంషాబాద్ ఏయిర్ పోర్టుకు చేరుకోగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు వారికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. యాత్ర నిర్వహణ దిగ్విజయంగా పూర్తి చేసినట్లు అల్‌మిజాన్ నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలి



జెడ్సీ వెంకన్నను సన్మానిస్తున్న సంగీతగౌరీశంకర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ కోరారు. జోనల్ కమిషనర్ వెంకన్నను గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి చేయూత అందించాలని పెండింగ్‌లో ఉన్న వివిధ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రొ. పద్మజకు అవార్డు



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్ పాలిటెక్నిక్స్ డైరెక్టర్ సీనియర్ ప్రొఫెసర్ పద్మజ ఇందిరా ఫారిఖ్ ఉమెన్ ఇన్ ఎడ్యుకేషన్ లీడర్స్ అవార్డును అందుకున్నారు. గురువారం ముంబాయిలో జరిగిన 12వ ఎడ్యుకేషన్ కాంగ్రెస్‌లో ఈ అవార్డును అందుకున్నారు.



ఖానాపూర్‌లో బోనాలతో వస్తున్న మహిళలు



వట్టినాగులపల్లిలో..

బోనం.. వైభవం

- నార్సింగి, ఖానాపూర్, వట్టినాగులపల్లిలో బోనాల శోభ
- ఆధ్యాత్మికతను సంతరించుకున్న గ్రామాలు



మణికొండ: శివసత్తుల శిగాలు, పోతరాజుల వీరంగాలు, కళాకారుల విన్యాసాల నడుమ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంతో పాటు ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలలో గురువారం నుంచే బోనాల సందడి మొదలైంది. పోచమ్మ, ఎల్లమ్మ, లక్ష్మమ్మలకు బోనాలను సమర్పించి తమను చల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఖానాపూర్, వట్టినాగులపల్లిలో మహిళలంతా మూకుమ్మడిగా బోనాలను నెత్తిన పెట్టుకుని దేవాలయాలకు చేరుకుని అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు యువకులు తొట్టెల ఊరేగింపులు నిర్వహించారు. వట్టినాగుల పల్లిలో వివిధ వేషధారణలతో నృత్యకారులు తమ ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు.

ఉప్పర్‌పల్లిలో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలో గురువారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బోనాల ఉత్సవాలతో పాటు తొట్టెల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. బ్యాండు చప్పుళ్లు, సిగసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువతి యువకుల కేరింతల నడుమ బోనాల పండుగను జరుపుకున్నారు. పోచమ్మ తల్లికి మహిళలు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.





నార్సింగిలో బోనాలతో దేవాలయానికి వస్తున్న మహిళలు



తొట్టెల పూజల్లో పాల్గొన్న నాయకులు, యువకులు



ఖానాపూర్‌లో బోనాలతో వస్తున్న మహిళలు

'నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు'

అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీ.వి నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేస్తున్నారని అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసనకు దిగారు. వీసీతో మాట్లాడుదామంటే ఆయన కలవడం లేదన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలోకి రానివ్వకుండా గేట్లు మూయడంతో గేటు ఎదుటే నిరసనగా దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం నిబంధనల మేరకు 5 సంవత్సరాల వరకు ఒకే దగ్గర విధులు నిర్వహించాలి. హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న కొందరు అధ్యాపకులు 7 సంవత్సరాలు అవుతున్నా వారిని బదిలీ చేయకుండా మూడేళ్లకే కొందరిని బదిలీ చేశారని ఆరోపించారు. విశ్వవిద్యాలయంపై అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి తమకు అనుకూలంగా ఉన్నవారిని 7 సంవత్సరాలు అవుతున్న హైదరాబాద్‌లోనే ఉంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన బదిలీలను రద్దు చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. 14న పశువైద్య విశ్వవిద్యాలయం గేట్ నుంచి పీవీ నర్సింహరావు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జైలు

రాజేంద్రనగర్: నిబంధనలు ఉల్లంఘించిన నలుగురికి జైలు శిక్ష విధించిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మద్యం తాగి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, పలు నిబంధనలు ఉల్లంఘించిన 19 మందిపై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్‌కిరణ్ కేసు నమోదు చేసి గురువారం 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ నజీరుద్దీన్‌షా ముందుకు హాజరుపరిచారు. 19 మందిలో ముగ్గురికి మూడు రోజులు, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగితా వారిని జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే మూడు నెలల జైలు శిక్షతో పాటు 10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

శంషాబాద్: నిబంధనలు ఉల్లంఘించిన 22 మంది వాహనదారులను రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చగా ఆరుగురిలో కొందరికి 2 రోజులు, మరి కొందరికి 5 రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా వారికి జరిమానా విధించారు.

చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ పాటు పడుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పథకాలను ప్రవేశపెడుతూ విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. వీటిని అర్హులైన ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్లు తలారీ చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, నాయకులు నాగరాజు, ఖాజా పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్: మూసీ పరీవాహక ప్రాంతంతో పాటు చెరువులను కబ్జా చేస్తున్నారంటూ మాజీ కౌన్సిలర్ కేఎస్.దయానంద్ గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. హిమాయత్‌సాగర్ ఈసీ కాలువ నుంచి లంగర్‌హౌస్ సంఘం వరకు, సంఘం నుంచి నందిముస్లాయిగూడ వరకు ఉన్న మూసీ పరీవాహక ప్రాంతంలో భారీగా కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. అలాగే గగన్‌పహాడ్ ప్రాంతంలోని చెరువును రియల్టర్లు మట్టితో నింపి ప్లాట్లుగా విభజిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై తాను రాజేంద్రనగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారన్నారు. దీంతో గురువారం జీహెచ్ఎంసీ ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



మైలార్‌దేవ్‌పల్లిలో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లిలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్స్ తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, లక్ష్మి, నాగమణి, పాండుయాదవ్, రాజు, గణేష్, కన్న, శివముదిరాజ్ పాల్గొన్నారు.

నార్సింగి ఎస్ఐల బదిలీలు

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న డి.బాలరాజు మాదాపూర్ స్టేషన్‌కు, కృష్ణయ్య కొందుర్గు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. గురువారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 83 మంది ఎస్సైలను బదిలీ చేశారు. నార్సింగి నుంచి బదిలీ అయిన వారి స్థానంలో మాదాపూర్ స్టేషన్ నుంచి వై. సుఖేందర్‌రెడ్డిని మాత్రమే పోస్టింగ్ ఇచ్చారు. వారం రోజుల క్రితం నార్సింగి మరో ఎస్సై అనిల్ కుమార్ బదిలీ కాగా అతను గురువారం రిలీవ్ అయ్యారు. నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సై మహ్మద్ ఆలం మాదాపూర్ ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ స్టేషన్ నుంచి మహ్మద్ గౌస్ ఖాన్‌ను బదిలీ చేశారు.

దారి దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్



కేసు వివరాలు తెలుపుతున్న డీసీపీ

రాజేంద్రనగర్: ఒంటరి మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ జగదీశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడురు మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన జోగు మల్లేశం (38) ఒంటరి మహిళలు, వృద్ధులను లక్ష్యం చేసుకుని అమాయకంగా నటిస్తూ అదును చూసి నగదుతో పాటు ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచుకుని పారిపోయేవాడు. ఈ నెల 11న మొయినాబాద్ ఎక్స్ రోడ్ ప్రాంతంలోని లేబర్ అడ్డా వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చి పని ఉందంటూ షీలరమ్మను తీసుకుని తోల్‌కట్ట గ్రామం వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి ఆమె వద్ద ఉన్న బంగారు కమ్మలు, బుట్టాలు, మాట్టీలతో పాటు ఫోన్, నగదు గుంజుకుని తలపై బండరాయితో మోదీ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సహాయంతో ఆమె మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడి నుంచి శంకర్‌పల్లి గ్రామం వద్దకు చేరుకున్నాడు. ఇదే సమయంలో చేవెళ్ల మండలం ఎక్కారెడ్డిగూడెంకు చెందిన చిన్నబాలయ్య అనే వృద్ధుడు కరెంటు బిల్లు కట్టేందుకు కార్యాలయానికి వచ్చి డబ్బులు లెక్కపెడుతుండగా అతడితో మాటలు కలిపి ఇక్కడ డబ్బులు తీసుకోరని డీడీ కడితే తీసుకుంటారని నమ్మబలికి బాలయ్యను తీసుకోని శంకర్‌పల్లిలోని ఓ మద్యం దుకాణానికి తీసుకెళ్లి మద్యం తాగించాడు. నిద్ర మత్తులోకి వెళ్లిన బాలయ్య వద్ద నుంచి రూ. 7 వేల నగదు తీసుకోని పారిపోయాడు. జరిగిన విషయాన్ని బాలయ్య కుమారుడు చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ రెండు కేసులపై దృష్టిసారించిన పోలీసులు నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం కానిస్టేబుల్ రవీందర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మల్లేష్‌పై అనుమానం రావడంతో ఉన్నతాధికారులకు తెలిపాడు. పోలీసులు అదుపులోకి తీసుకోని విచారించగా ఈ రెండు కేసులతో పాటు మరిన్ని దోపిడీలకు పాల్పడినట్లు వెల్లడించాడు. నిందితుడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. త్వరలో కస్టడీకి తీసుకోని విచారిస్తామని డీసీపీ వెల్లడించారు. ఈ కేసులో ప్రతిభ చూపిన మొయినాబాద్, చేవెళ్ల పోలీసులను డీసీపీ అభినందించారు.

పనుల పరిశీలన



బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవన నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొత్తం రూ.7.30 కోట్లతో నూతనంగా కిస్మత్‌పూర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. అధునాతన పద్ధతిలో కార్యాలయంలో వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మరో నెల రోజుల పనులు పూర్తి కావడం జరుగుతుందని వెల్లడించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అత్తాపూర్ వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు

నిలువెత్తు నిర్లక్ష్యం.. ప్రమాదాలకు ఆస్కారం

రాజేంద్రనగర్: పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై ద్విచక్ర వాహనాలను అడ్డుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్ వేపై కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉంది. కానీ కొందరు ద్విచక్ర వాహనాలతో ఎక్స్‌ప్రెస్ వేపై వస్తున్నారు. గురువారం ఉదయం ఓ ద్విచక్ర వాహనదారుడు రాంగ్ రూట్‌లో వచ్చి వాహనదారులను ఆందోళనకు గురి చేశాడు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రతి వాహనం 80 స్పీడ్‌లో వెళ్తోంది. రాంగ్‌రూట్‌లో వచ్చిన ద్విచక్ర వాహనం కారణంగా కారు యజమానులు ఆందోళనకు గురై ఫొటోలు తీసి స్థానిక మీడియాకు అందించారు. ట్రాఫిక్ పోలీసులు ఈ ఎక్స్‌ప్రెస్‌వేపై నిఘా ఏర్పాటు చేయడం లేదని దీని కారణంగా ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, బస్సుల సైతం రాకపోకలు సాగిస్తున్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు నిఘా ముమ్మరం చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



హైదర్‌గూడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజేంద్రనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి వారిని జాగృతం చేయాలని రాజేంద్రనగర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఏవీ. రామంజనేయులు, రవీంద్ర భారతీ పాఠశాల ప్రిన్సిపల్ సుధా అన్నారు. ధరిత్రీ రక్షణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అత్తాపూర్ రవీంద్ర భారతీ పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై అత్తాపూర్, హైదర్‌గూడ, కృష్ణానగర్, శివానగర్ మీదుగా ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నిషేధించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ఇన్‌చార్జి పరమేష్, మేనేజర్ ప్రకాష్ మిశ్రా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్: పర్యావరణ పరిరక్షణ విద్యార్థులు, ప్రజల్లో చైతన్యం మరింత పెరగాలని శంషాబాద్ రేంజ్ అటవీశాఖ అధికారి వి. మురళిమనోహర్ సూచించారు. ధరిత్రి వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాల ఆధ్వర్యంలో నో ప్లాస్టిక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణంలోని ఆయా బస్తీలో ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగులే వాడాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు మమత, శివసాయి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కిస్మత్‌పూర్‌లో జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందని అందుకు ప్రజలంతా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ 9వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో కిస్మత్‌పూర్ యాదాద్రి కాలనీ, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీలలో గురువారం హాథ్ సే హాథ్ జోడో అభియాన యాత్రను నిర్వహించారు. 9వ డివిజన్ కార్పొరేటర్ లంకల నిఖిలసంగారెడ్డి, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రకు రాజేంద్రనగర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులకు ఉచిత కరెంటు ఇచ్చింది రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత కరెంట్ ఇస్తుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షులు పవన్‌కుమార్, రైతు సహకార సంఘం డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, ఎల్. ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు



పోటీలకు వెళ్తున్న క్రీడాకారులు, కోచ్

మణికొండ: థాయ్‌లాండ్‌లో ఈనెల 14, 15, 16వ తేదీల్లో జరిగే అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు రాష్ట్రం నుంచి 20 క్రీడాకారులు పాల్గొంటున్నారని సోమస్పిట్ అకాడమీ గ్రాండ్ మాస్టర్, ఇండియా కోచ్ సోమ విజయ్‌కుమార్ గురువారం మణికొండలోని ఆయన అకాడమీలో తెలిపారు. తన ఆధ్వర్యంలో క్రీడాకారులు గురువారం రాత్రికి బయలుదేరుతారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మీర్ వాహజ్ అలీ వారందరినీ ప్రత్యేకంగా అభినందించి ప్రతిఒక్కరూ బంగారు పథకాలను సాధించాలని సూచించారు. క్రీడాకారులతో పాటు రాష్ట్ర తైక్వాండో ఫైనాన్స్ కమిటీ చైర్మన్ మారుతి, రిఫరీ కమిటీ చైర్మన్ నర్సింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్రమణ్యం థాయ్‌లాండ్ వెళ్తున్నారని కోచ్ తెలిపారు.

'అక్షయపాత్ర'ను సందర్శించిన విద్యార్థులు



మణికొండ: నార్సింగి రెవెన్యూ పరిధిలో ఉన్న 'అక్షయపాత్ర' ఫౌండరేషన్‌ను సీబీఐటీ కళాశాల ఎంబీఏ 4వ సెమిస్టర్ విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వంటశాల, లాజిస్టిక్స్, సప్లయ్ మేనేజ్‌మెంట్, ఆహార తయారీ, పంపిణీ ప్రక్రియను ఫౌండేషన్ ప్రతినిధి రాకేష్‌కుమార్ మిశ్రా వారికి వివరించారు. తమ సంస్థ దేశవ్యాప్తంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేస్తున్న సంస్థ అని, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, రైతులకు సద్దిమూట, ఆస్పత్రుల్లో రోగులు, అటెండర్‌లకు, పేదలకు అందిస్తుందన్నారు. సమన్వయ కర్తలు తులసీరామ్, బాలాజీ కేశవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.